క్లుప్తంగా

నేడు శివలింగానికి పంచామృతాభిషేకం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయంలో సోమవారం శివలింగానికి, నందీశ్వరునికి ఏక కాలంలో పంచామృతాభిషేకం జరుగుతుందని ఆలయ సేవకుడు సనగరం పట్టాభిరామయ్య తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

కురబలకోట వైద్యాధికారి బదిలీ


డాక్టర్ శ్రీధర్

కురబలకోట: కురబలకోట ప్రభుత్వ ఆసుపత్రి మండల వైద్యాధికారి కె. శ్రీధర్ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఏడేళ్లుగా ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు. కరోనా సమయంలో ఉత్తమ సేవలు అందించారు. ఉత్తమ వైద్యాధికారిగా కూడా జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.

వైభవంగా ఊరేగింపు


ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ప్రారంభమైన సోళెం ఊరేగింపు

కలికిరి: కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ సోళెం ఊరేగింపు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారికి, ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరణ చేసిన పల్లకిపై ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. రెడ్డివారి వంశస్తులు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూజలలో పాల్గొని సోళెం ఊరేగింపును ప్రారంభించారు. జూలై నెల 12న ఎల్లమ్మ జాతర ప్రారంభం కానున్న సందర్భంగా అమ్మవారి సోళెం జాతర వరకు 20 రోజుల పాటు కలికిరి పంచాయతీ పరిధిలో గ్రామ గ్రామాన పూజలందుకుని తిరిగి ఆలయానికి చేరుకోవడంతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆలయ నిర్వాహకులు వెంకటరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సురేంద్రరెడ్డి, యోగేష్ రెడ్డి, న్యాయవాది యల్లారెడ్డి, భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్: పట్టణంలో ఆదివారం జరిగిన వివాహ, గృహప్రవేశ వేడుకల్లో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. మండల మాజీ కోఆప్షన్ మెంబర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఇస్మాయిల్ ఆహ్వానం మేరకు ఆర్.ఆర్.గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆయన కుమార్తె షానోర్, సద్దాం హుస్సేన్ వివాహ వేడుకలో, పీపీఆర్ కల్యాణమండపంలో జరిగిన తోసుఫ్, మహమ్మద్ రఫీ వివాహ వేడుకలో, పుంగనూరులో జరిగిన జునైద్‌బాషా, సమీరా వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కురబలకోట మండలం సందిరెడ్డిగారిపల్లెలో మదార్ సాబ్ ఆహ్వానం మేరకు గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌అజాం, కౌన్సిలర్ బి.ఏ.ఖాజా, వైఎస్సార్ సీపీ నాయకులు డి.హర్షవర్దన్‌రెడ్డి, డాక్టర్.అనిల్‌కుమార్‌రెడ్డి, తట్టిశ్రీనివాసులురెడ్డి, కొండవీటి నాగభూషణం, అలీంబాషా, అమరనాథరెడ్డి, ఫిరోజ్, మల్లయ్య, విశ్వనాథరెడ్డి, ఇర్ఫాన్, జహీర్, నూర్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

తంబళ్లపల్లె: మండలంలోని పరసతోపు పంచాయతీ బలకవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు భాస్కరరెడ్డి(56) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆ గ్రామానికి వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుని కుమారుడు చిరంజీవిరెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ కరీం, మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు రవిశంకర్ రెడ్డి, నరేంద్రరెడ్డి, జయనారాయణరెడ్డి, కిషోర్‌రెడ్డి, సురేంద్ర, నారాయణరెడ్డి ఉన్నారు.

నివాళి

కలికిరి(వాల్మీకిపురం): మండలంలోని కూరపర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పులి రామచంద్రారెడ్డి(70) మరణించారు. ఆయన మృతి సమాచారంతో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం ఉదయం కూరపర్తికి చేరుకుని పులి రామచంద్రారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాయితీతో జిప్సం ఇవ్వాలి

పీలేరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు రాయితీతో జిప్సం ఇవ్వాలని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఏటా ఖరీఫ్‌సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 120 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నారని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తారని చెప్పారు. వేరుశనగ రైతులకు సబ్సిడీతో జిప్సం అందించి ఆదుకోవాలని కోరారు.

తల్లికి వందనం.. అర్హులకు ఎగనామం


తల్లికి వందనం కోసం గ్రామసచివాలయంలో వాకబు చేయడానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు


తల్లికి వందనం అందలేదని చెబుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- నియోజకవర్గంలో 7,461 మందికి జమకాని తల్లివందనం
- కార్యాలయాల చుట్టూ తల్లుల ప్రదక్షిణలు

గుర్రంకొండ: ఎన్నో ఆశలతో ఎదురుచూసిన తల్లికి వందనం పలువురు అర్హులైన తల్లులకు అందలేదు. పీలేరు నియోజకవర్గంలో 7461 మంది తల్లులకు తల్లికి వందనం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. దీంతో చేసేదిలేక అసలు ఎందుకు రాలేదో తెలుసుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటబెట్టుకొని గ్రామ సచివాలయాలు వద్ద పడిగాపులు కాస్తూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

తల్లడిల్లుతున్న తల్లులు:
తల్లికి వందనం అర్హత ఉన్నా అందకపోవడంతో తల్లులు తల్లడిల్లిపోతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 46031 మంది విద్యార్థులు చదుకొంటున్నారు . ఇందులో 38570 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం అందింది. కాగా 7461 మంది విద్యార్థులకు తల్లికి వందనం తాలుకూ నగదు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల పరిధిలో అర్హులు, అనర్హుల జాబితాను అధికారులు అందుబాటులో ఉంచారు. బ్యాంకులకు వెళ్లి తల్లికి వందనం డబ్బులు జమ కాకపోవడంతో గ్రామా సచివాలయాల వద్దకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులు అసలు విషయం వాకబు చేసుకొంటున్నారు. అక్కడి అనర్హుల జాబితాలో తమ పేర్లకు ఎదురుగా చూపిన కారణాలను చూసి అవాక్కవుతున్నారు.

అర్హత ఉన్నా అందని పథకం:
అనర్హత జాబితాలో పేర్లు ఉన్న పలువురు లబ్ధిదారులకు అన్ని అర్హతలున్నా పథకం అందక పోవడం గమనార్హం. అనర్హత లబ్ధిదారులకు ఎందుకు పథకం అందలేదో కారణాలు చూపారు. 300 యూనిట్లు కంటె ఎక్కువ కరెంటు బిల్లులు రావడం, ఇంట్లో ఆదాయ పన్ను కట్టేవారు, ఉద్యోగం చేసేవారు ఉండడం, ఎక్కువ ఆస్తులు ఉండడం వంటి కారణం. కాంట్రాక్ట్ ఉద్యోగమైనా రూ.12000 కంటే ఎక్కువజీతం తీసుకొనేవారు, సరైన ఆదాయ ధృవీకరణ పత్రం లేనివారు అనర్హలంటూ కారణాలు చూపారు. వీటితోపాటు పలువురికి నాలుగు చక్రాల వాహనాలు కలిగినవారు, 10 ఎకరాల కంటే ఎక్కువ భూములు ఉన్న వారు కూడా అనర్హులంటూ జాబితాలో పేర్లు పొందుపరిచారు. అయితే వాస్తవంగా ఇందులో పలువురికి ఈ కారణాలు వర్తించడం లేదు. వాహనాలు లేకపోయినా, భూములు వారి పేర్లతో అంత మొత్తం విస్తీర్ణం లేకపోయినా ఉన్నట్లు చూపించారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో చేసేదిలేక గ్రామ సచివాలయాకు వెళ్లి తమకు ఎందుకు పథకం అందలేదో తెలుసుకొని తమకు అన్ని అర్హతలు ఉన్నాయంటూ ఆధారాలు చూపిస్తూ ప్రశ్నిస్తున్నారు.

రెవెన్యూశాఖలో దొర్లిన తప్పులు:
రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలకు పలువురికి తల్లికి వందనం పథకం అందడం లేదు. పలుచోట్ల రెవెన్యూ అధికారులు ఇద్దరు, లేదా ముగ్గురు రైతులను ఉమ్మడి కుటుంబాలకు చెందినవారిగా చూపించి వారికి జాయింట్ ఖాతాలు సృష్టించి ఉమ్మడి ఆస్తిగా పట్టాదారు పాసుపుస్తకాల్లో చూపించారు. ఇందులో దొర్లిన తప్పులను సరిదిద్దుకొనే అవకాశం రైతులకు చాలా రోజులుగా ఇవ్వలేదు. దీంతో వాస్తవంగా 10 ఎకరాల భూమి లేకపోయినా అధికారుల చేసిన పొరబాట్ల కారణంగా నేడు పలువురు తల్లులకు తల్లికి వందనం పథకం అందకపోవడం గమనార్హం. దీంతో పలువురు తమకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికిగానూ రైతులు ఈనెల 30లోగా గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకొంటే న్యాయం చేస్తామని బహిరంగా ప్రకటనల చేశారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకు తల్లులకు పథకం అందక నానా కష్టాలు పడుతున్నారు.

నాకు పథకం అందలేదు



నేను గుర్రంకొండలో పదవ తరగతి చదివాను. మా ఊర్లో నాతోపాటు చదువుకొన్న అందరికి తల్లికి వందనం డబ్బులు వచ్చాయి. నాకు మాత్రం డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. సచివాలయంకు వచ్చి కారణం తెలుసుకొని సరైన ఆధారాలు చూపించాను. మళ్లీ దరఖాస్తు చేసుకొంటున్నాను.

–ముబారక్, కుమ్మరపల్లె

కూలీ పని చేసుకొనే వాళ్లం



మేము కూలీపనులకు చేసుకొని జీవిస్తున్నాం. మాపిల్లలకు తల్లికి వందనం రాలేదు. ఎందుకు రాలేదో మాకు అర్థం కావడం లేదు. కారణం తెలుసుకొందామని గ్రామసచివాలయం వద్దకు వెళ్లి అధికారులను అడిగాను. వారి చెప్పిన కారణాలు మాకు వర్తించవు. మాకు అన్ని అర్హతలున్నా పథకం వర్తించలేదు.

– జి. వెంకటేష్, మామిళ్లవారిపల్లె

బీజేపీ ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పెద్దతిప్పసముద్రం: దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోతుపేటకు చెందిన నేషనల్ హెల్ప్‌లైన్ అగేనిస్ట్ అట్రాసిటీ (ఎన్‌హెచ్‌ఏఏ) ఫీల్డ్ లెవల్ కౌన్సిలర్ కేవీ రమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆదోని మండలం ధనాపురం గ్రామ దళిత సర్పంచ్‌ని స్టేజి పైకి రావాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పిలవగానే పక్కనే ఉన్న టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ కలుగజేసుకుని అతను ఎస్సీ సర్పంచ్ స్టేజిపైకి రాడు అని ఎమ్మెల్యేకు సూచించగా నువ్వు ఇక్కడకు వచ్చి కింద నిలబడు అని తన కాళ్ల వద్ద స్టేజి కింద స్థలాన్ని చూపి అవమానపరచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సభలో గ్రామ ప్రథమ పౌరుడైన దళిత సర్పంచ్‌పై కుల వివక్ష చూపి అవమానించిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలిపై కేసు నమోదు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం దళిత కాలనీల్లో ఇంటింటికీ తిరిగిన కూటమి నేతలకు అప్పుడు దళితులనే విషయం తెలియలేదా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, హైకోర్టు లీగల్ సెల్ అథారిటీ వెంటనే ఈ ఘటనపై స్పందించి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు.

ఉపాధిపై అవగాహన ర్యాలీ

మదనపల్లె: మదనపల్లె రూరల్ మండలం బొమ్మనచెరువులో ఆదివారం ఉపాధి పథకం కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం, ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ టీం, గ్రామస్తులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ సంస్థ డైరెక్టర్ జి.శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో వేతనదారుల హక్కులు, సౌకర్యాల గురించి వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులలు, వాటికైన ఖర్చులను ప్రతిఒక్కరూ తెలుసుకునే విధంగా నిధుల వ్యయ వివరాలను వివరించారు. సోషల్ ఆడిట్ ముఖ్య ఉద్దేశం, వంద రోజుల పనులు పూర్తిచేసుకునే ప్రతి కుటుంబానికి రోజువారి వేతనము రూ.307 పొందేలా వేతనదారుల జీవనోపాధి పెంచడం లక్ష్యమని వివరించారు. సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీలు బి.కన్నారెడ్డి, డిఆర్పీలు ఏ శివప్రసాద్, జి.సుబ్రమణ్యం, కేసి.సుబ్బరాయుడు, రవీంద్ర, గంగప్ప పాల్గొన్నారు.

యువతపోరు విజయవంతం చేయండి


వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేసిన వైనాన్ని నిరసిస్తూ సోమవారం నిర్వహించనున్న యువత పోరు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వేపులబైలులో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. సోమవారం కలెక్టరేట్‌లో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వినతిపత్ర అందజేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నలుమూలల నుంచి నిరుద్యోగులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

- వేపులబైలు పంచాయతీ మిట్టపల్లె నందు మృతి చెందిన అమరనాథరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కేవీపల్లె మండలం గ్యారంపల్లె పంచాయతీ శెట్టిపల్లెవారిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరమణారెడ్డి మనుమడు మోక్షిత్‌రెడ్డి కేశఖండన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హరీష్‌రెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, చెంగల్‌రాయుడు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దాం

- యువత పోరుకు తరలిరండి
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చెసిన కూటమి ప్రభుత్వానికి యువత పోరు ద్వారా కనువిప్పు కలిగించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నందిరెడ్డిగారిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకుడు మదార్‌సాబ్ ఇంట జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత బండపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకుడు అశోక్ రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల అతని భార్య మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. యువ నాయకుడు బండపల్లె కృష్ణారెడ్డి ఇంటిని సందర్శించారు. అనంతరం ఆయన వైఎస్సార్ సీపీ మదనపల్లె నియోజక వర్గ సమన్వయ కర్త నిస్సార్ అహ్మద్‌తో కలసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదికే ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. అన్ని వర్గాలను చంద్రబాబు దగా చేస్తున్నారన్నారు. మాటలతో కాలయాపన చేస్తున్నారన్నారు. విద్యార్థులను, యువతను మోసం చేసిన ప్రభుత్వ కళ్లు తెరిపించేందుకు సోమవారం చేపట్టిన యువత పోరును విజయవంతం చేయాలన్నారు. ఏడాది కావస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలు గురించి పట్టించుకోవడం లదేన్నారు.ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. తప్పుడు కేసులకు భయపడేదిలేదని తెలిపారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. రాష్ట్ర ప్రజలు జగనన్న సంక్షేమ పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీలో యువత పాత్ర కీలకమని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై కార్మికుల నిరసన


ఒంటికాలిపై నిలుచుని నినాదాలు చేస్తున్న కార్మికులు

మదనపల్లె: మదనపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె భాగంగా ఆదివారం 19వ రోజు దీక్షా శిబిరంలో కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మిక జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కార్మికులు 45 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం, టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం అడుగుతున్నామని అన్నారు. వేతనం తక్కువగా ఇస్తూ.. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం లేదన్నారు. న్యాయమైన డిమాండు తీర్చకపోతే సోమవారం నుంచి మెరుపు సమ్మె చేస్తామని ప్రకటించారు.

ప్రతి రోజు ప్రజలకు వీధిలైట్లు, తాగునీటి సరఫరా సేవలను నిలిపివేస్తామని అన్నారు. దీక్షలో ఎస్‌కే. రెడ్డప్ప, ఏంఎస్.కన్నయ్య, నాగరాజు, బాబు, బాలకృష్ణ, సజాద్, కుమార్, రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


అంబేడ్కర్ విగ్రహం ధ్వంశం చేసిన నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్న మాల సంఘాల జేఏసీ నేతలు

కలికిరి: కేవీ పల్లి మండలం గర్నిమిట్ట పంచాయతీ నల్లగుట్ట క్రాస్ సమీపంలోని కాలనీలో దళితులు ఏర్పాటు చేసుకున్న బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత్ మాల సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం కలికిరిలో సమావేశమైన వారు మాట్లాడుతూ గతంలో కూడా కేవీ పల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, ఇప్పుడు మరోసారి ధ్వంసం చేసి దళితులను కించపరుస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిందితులను గుర్తించి చర్యలు తీసుకోకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. జేఏసీ నేతలు మలతోటి నరేష్, నారాయణ, వెంకటరమణ, దామోధరం, సురేంద్ర, రెడ్డెమ్మ, రమణ, గంగులమ్మ, రామక్రిష్ణ, పి.దామోదరం, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతులతోనే క్వారీ నిర్వహణ


క్వారీ అనుమతి పత్రాలు చూపిస్తున్న గాయత్రి అగ్రిగేట్స్ డైరెక్టర్ జబ్బల శ్రీసాయి

మదనపల్లె రూరల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి అన్ని అనుమతులు పొంది 21 ఏళ్లుగా గాయత్రి అగ్రిగేట్స్ క్వారీ నిర్వహిస్తోందని సంస్థ డైరెక్టర్ జబ్బల శ్రీసాయి తెలిపారు. ఆదివారం గాయత్రి పార్క్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మదనపల్లె మండలం బసినికొండ రెవెన్యూ విలేజ్ సర్వేనంబర్ 10 నుంచి 72లో 3.5 హెక్టార్ల విస్తీర్ణంలో క్వారీ నిర్వహణకు 2004లో మండల రెవెన్యూ అధికారి నుంచి ఎన్‌ఓసీ తీసుకోవడం జరిగిందన్నారు. తర్వాత 0.920 హెక్టార్లు తమ తండ్రి జబ్బల శ్రీనివాసులు, 0.860 హెక్టార్లు తల్లి జబ్బల మీనా పేరుమీద ఆంధ్రప్రదేశ్ మైన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతులు పొందామన్నారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు తాము నిర్వహిస్తున్న క్వారీలోని కొంత భూమి, తమకు చెందినదని, డీకేటీ పట్టా ఉందని రెవెన్యూ అధికారులను సంప్రదించారన్నారు. అయితే రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి గయాలు భూమిగా ఉందని, డీకేటీ భూమిగా లేదని, రెవెన్యూ అధికారులు పేర్కొంటూ క్వారీ నిర్వహించుకోవచ్చని తమకు అనుమతి ఇచ్చారన్నారు. 20 ఏళ్లుగా తాము క్వారీ నిర్వహిస్తున్నప్పటికీ, ఎప్పుడూ రాని వ్యక్తులు.. ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తుండటంతో తాము మదనపల్లె జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో సివిల్ కేసు వేశామన్నారు. దీనిపై న్యాయస్థానం ఇంజక్షన్ ఆర్డర్ మంజూరుచేస్తూ, ఇతరులు క్వారీ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోరాదని ఆదేశాలిచ్చిందన్నారు. అలాగే మైనింగ్ శాఖకు అందిన ఫిర్యాదుమేరకు...డివిజనల్ మైన్స్ అధికారి, ఎమ్మార్వో, ఆర్ఐ, సర్వేయర్, హౌసింగ్ ఏఈ తదితరులు జాయింట్ ఇన్స్‌పెక్షన్ సర్వే నిర్వహించి తదుపరి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారన్నారు. ఇదిలా ఉండగా ఈనెల 14వతేదీ రాత్రి 11గంటల సమయంలో కొందరు క్వారీ స్థలంలోకి ప్రవేశించి, సిబ్బందిపై దాడిచేయడంతో పాటు యంత్రాలు, టిప్పర్ అద్దాలను ధ్వంసం చేశారన్నారు. దీనిపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశామన్నారు. అలాగే గాయత్రి పార్క్ నిర్మాణానికి సంబంధించి సమీపంలోని చెరువుస్థలాన్ని ఆక్రమించేశారంటూ తమపై దుష్ప్రచారం చేశారన్నారు. మండల తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు ఈ విషయమై నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి ఆక్రమణలు జరగలేదని నిర్ధారించారన్నారు. వరుసగా జరుగుతున్న ఘటనలను చూస్తుంటే, తమపై, సంస్థపై కావాలనే దురుద్దేశంతో కొందరు అవాస్తవాలు, వదంతులను ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. సమావేశంలో సిబ్బంది చైతన్య పాల్గొన్నారు.

భూగర్భ వంతెన సాధించిన ఘనత వైఎస్సార్‌సీపీదే


భూగర్భ వంతెనను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు

- 24 గ్రామాల ప్రజలకు తప్పనున్న ఇబ్బందులు
- 2 వేల మంది విద్యార్థులకు మేలు
- ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వం, గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిదేనని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికారప్రతి నిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ డబుల్ వే బ్రిడ్జ్ పనులను ఆదివారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దశాబ్దాలుగా చేపట్టలేని, ఎవరూ పట్టించుకోని రైల్వే అండర్ బ్రిడ్జిని వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మంజూరు చేయించడం జరిగిందన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు కనెక్టింగ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకొంటామని, దశాబ్దాల కల నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ 24 గ్రామాలకు, వేల మంది విద్యార్థులకు ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపీ పెద్దిరెడ్డిమిథున్‌రెడ్డి సహకారంతో రూ.10.60 కోట్లు వంతెన నిర్మాణానికి మంజూరు చేయించామన్నారు. కూటమి నాయకులు కొత్త పనులు తేలేకపోయినా గత ప్రభుత్వంలో తాము మంజూరు చేయించిన పనులు నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఏదైనా చేయాలనే తపనతో తాము పనిచేశామని, రూ.2200 కోట్లతో గ్రీన్ ఎక్స్‌ప్రెక్స్ హైవేకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఆ పనులు చేసుకోలేని దుస్థితిలో కూటమి నాయకులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు భరత్‌కుమార్ రెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్, శివయ్య, సురేష్ బాబు, సీహెచ్.రమేష్, మందల నాగేంద్ర, గునిశెట్టి రమేష్, కొరెడ్డి సిద్ధయ్య, బందారుమల్లి, కాంట్రాక్టర్లు శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

150 లీటర్ల సారా ఊట ధ్వంసం


సారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ భీమలింగ, ఎస్ఐ జబీవుల్లా తదితరులు

మదనపల్లె రూరల్: మండలంలోని నారమాకులతండా అటవీప్రాంతంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో 150 లీటర్ల సారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నారమాకులతండాలోని అటవీప్రాంతంలో సారా బట్టీ నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. నారమాకుల తండాకు చెందిన మూడే శ్రీనివాసులు నాయక్ భార్య మూడే హరిత(32) బట్టీ ఏర్పాటు చేసుకుని సారా వండుతున్నట్లు గుర్తించామన్నారు. ఎక్సైజ్ సిబ్బందిని చూసి ఆమె పారిపోవడం జరిగిందని, త్వరలోనే ఆమెను అరెస్ట్ చేస్తామన్నారు. దాడుల్లో గుర్తించిన 150 లీటర్ల సారాఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


గురువులతో పూర్వ విద్యార్థులు

స్థానిక ఉన్నతపాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఓ ప్రత్యేక కార్యక్రమంలో కలుసుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఆనాటి గురువులు హెచ్‌ఎం సిద్దారెడ్డి, గణితం ఉపాధ్యాయులు సాయిప్రసాద్, డ్రాయింగ్ మాస్టర్ వెంకటరమణలను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

–తంబళ్లపల్లె